20-06-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

# " మధురమైన పిల్లలారా - మీ సమయం చాలా విలువైనది, అందువలన వ్యర్థమైన విషయాలలో మీ సమయాన్ని వ్యర్థము చేయకండి "

**ప్రశ్న :-** మనుష్యుల నుండి దేవతలుగా అయ్యేందుకు తండ్రి ద్వారా ఏ శ్రీమతము లభించింది ?

**జవాబు :-** 1. పిల్లలారా! మీరు మనుష్యుల నుండి దేవతలుగా అవుతున్నారు కనుక మీలో ఎలాంటి ఆసురీ స్వభావము ఉండరాదు. 2. ఎవ్వరి పైనా కోపగించుకోరాదు. 3. ఎవ్వరికీ దుఃఖము కలిగించరాదు. 4. ఎలాంటి వ్యర్థమైన విషయాలను చెవులతో వినరాదు. తండ్రి శ్రీమతము - చెడు వినకు.....

**ఓంశాంతి.** పిల్లలైన మీరు చాలా సాధారణంగా కూర్చోవాలి. ఎక్కడైనా కూర్చోవచ్చు. అడవిలోనైనా కూర్చోండి, పర్వతము మీదైనా కూర్చోండి, ఇంట్లో అయినా కూర్చోండి లేక కుటీరములోనైనా కూర్చోండి. ఎక్కడైనా కూర్చోవచ్చు. ఇలా కూర్చున్నందున పిల్లలైన మీరు బదిలీ అవుతారు. ఇప్పుడు మనము మనుష్యులము. భవిష్యత్తులో దేవతలుగా అవుతున్నామని, ముళ్ల నుండి పుష్పాలుగా అవుతున్నామని పిల్లలైన మీకు తెలుసు. బాబా తోటయజమానే కాక తోటమాలి కూడా. మనము తండ్రిని స్మృతి చేయడం ద్వారా, 84 జన్మల చక్రాన్ని తిప్పడం ద్వారా బదిలీ అవుతున్నాము. ఇక్కడ కూర్చోండి లేదా మరెక్కడైనా కూర్చోండి. మీరు బదిలీ అవుతూ అవుతూ మనుష్యుల నుండి దేవతలుగా అవుతూ ఉంటారు. బుద్ధిలో మేమిలా అవుతున్నామని బుద్ధిలో లక్ష్యముంది. ఏ పని చేస్తున్నా, రొట్టెలు కాలుస్తున్నా, బుద్ధిలో కేవలం తండ్రిని స్మృతి చేయండి. పిల్లలకు ఈ శ్రీమతము లభిస్తూ ఉంది - " **నడుస్తూ, తిరుగుతూ అన్ని పనులు చేస్తూ కేవలం స్మృతిలో ఉండండి.**" తండ్రి స్మృతి ద్వారా వారసత్వము కూడా స్మృతి వస్తుంది, 84 జన్మల చక్రము కూడా స్మృతి వస్తుంది. ఇందులో ఇంకే ఇతర కష్టమూ లేదు. మనము దేవతలుగా అవుతున్నాము కనుక ఎలాంటి ఆసురీ స్వభావము ఉండరాదు. ఎవరి పైనా కోపగించుకోరాదు, ఎవరికీ దుఃఖమునివ్వరాదు, ఎలాంటి వ్యర్థ విషయాలను చెవులతో వినరాదు. కేవలం తండ్రిని స్మృతి చేయండి. ప్రపంచములోని వ్యర్థ విషయాలనైతే చాలా వింటూ వచ్చారు, అర్ధకల్పము నుండి వ్యర్థ మాటలు వింటూ వింటూ మీరు క్రిందకు దిగజారిపోయారు. ఇప్పుడు తండ్రి చెప్తున్నారు - ఇక్కడి మాటలు అక్కడ, అక్కడి మాటలు ఇక్కడ చెప్పరాదు. ఫలానావారు ఈ విధంగా ఉన్నారు, వీరిలో ఇది ఉంది... ఇటువంటి వ్యర్థ మాటలు మాట్లాడరాదు. ఇది తమ సమయాన్ని వ్యర్థము చేసుకోవడమే. మీ సమయం చాలా విలువైనది. చదువులోనే మీ కళ్యాణముంది, దీని ద్వారానే పదవిని పొందుతారు. ఆ చదువులో చాలా కష్టపడవలసి వస్తుంది. పరీక్ష పాసయ్యేందుకు విదేశాలకు వెళ్తారు. తండ్రి మీకు ఏ కష్టమూ కలిగించరు. తండ్రి ఆత్మలకు చెప్తారు - తండ్రినైన నన్ను స్మృతి చేయండి, ఒకరికి ఒకరు ఎదుట కూర్చోబెట్టినా తండ్రి స్మృతిలో ఉండండి. స్మృతిలో కూర్చుంటూ, కూర్చుంటూ మీరు ముళ్ళ నుండి పుష్పాలుగా అవుతారు. ఇది ఎంత మంచి యుక్తి! మరి తండ్రి శ్రీమతమును అనుసరించాలి కదా! ప్రతి ఒక్కరికి వేరు వేరు రోగాలుంటాయి. అయితే ప్రతి రోగము కొరకు సర్జన్ ఉంటారు. పెద్ద పెద్ద మనుష్యుల దగ్గర ప్రత్యేకంగా సర్జన్ ఉంటారు కదా! మీ సర్జన్‌గా

ఎవరున్నారు? భగవంతుడు. వారు అవినాశి సర్జన్. నేను మిమ్ములను అర్ధకల్పము కొరకు నిరోగులుగా చేస్తానని అంటారు. కేవలం నన్ను స్మృతి చేసినట్లయితే, వికర్మలు వినాశనమౌతాయి. మీరు 21 జన్మల కొరకు నిరోగులుగా అవుతారు. ఈ ముడి(ప్రతిజ్ఞ) వేసుకోవాలి. స్మృతి ద్వారానే మీరు నిరోగులుగా అవుతారు. తర్వాత 21 జన్మల కొరకు ఎలాంటి రోగమూ ఉండదు. భలే ఆత్మ అయితే అవినాశి. శరీరమే రోగిగా అవుతుంది. కాని భోగించేది ఆత్మయే కదా! అక్కడ మీరు అర్ధకల్పము మీరెప్పుడూ రోగిగా అవ్వరు. కేవలం స్మృతిలో తత్పరులై ఉండండి. పిల్లలే సేవ చేయాలి. ప్రదర్శనీలో సేవ చేస్తూ చేస్తూ పిల్లల కంఠము ఎండిపోతుంది, మూసుకుపోతుంది. కొంతమంది పిల్లలు మేము సర్వీసు చేస్తూ చేస్తూ బాబా దగ్గరకు వెళ్లిపోతామని భావిస్తారు. సర్వీసు చేయు ఈ పద్ధతి కూడా చాలా బాగుంది. ప్రదర్శనిలో కూడా పిల్లలు అర్థము చేయించాలి. ప్రదర్శనిలో మొట్టమొదట ఈ లక్ష్మీనారాయణుల చిత్రము చూపించాలి. ఇది ఫస్టుక్లాసు చిత్రము. భారతదేశములో నేటికి 5 వేల సంవత్సరాల క్రితము వీరి రాజ్యముండేది. లెక్కలేనంత ధనముండేది. పవిత్రత, సుఖ-శాంతులన్నీ ఉండేవి. కాని భక్తిమార్గములో సత్యయుగానికి లక్షల సంవత్సరాలని చూపించారు. మరి ఏ విషయమైనా ఎలా గుర్తొస్తుంది? ఈ లక్ష్మీనారాయణులది ఫస్ట్‌క్లాస్ చిత్రము. సత్యయుగములో వీరి వంశమువారు 1250 సంవత్సరాలు రాజ్యపాలన చేశారు. ఇంతకుముందు మీకు కూడా ఇది తెలిసేది కాదు. ఇప్పుడు పిల్లలైన మీకు తండ్రి స్మృతిని కలిగించారు - మీరే మొత్తం విశ్వం పై రాజ్యము చేసేవారు, ఈ విషయం మీరు మర్చిపోయారా? 84 జన్మలు కూడా మీరే తీసుకున్నారు. మీరే సూర్య వంశీయులుగా ఉండేవారు. పునర్జన్మలనైతే తీసుకుంటారు. 84 జన్మలు మీరెలా తీసుకున్నారో అర్థము చేసుకోవడం చాలా సులభము, సింపుల్ విషయము. క్రిందకు దిగజారుతూ వచ్చారు, ఇప్పుడు తండ్రి ఎక్కే కళలోకి తీసుకెళ్తారు. మీ ఎక్కే కళ ద్వారా అందరికీ మేలు జరుగుతుందని గాయనముంది(చఢ్‌తీ కళా తేరే భానే సర్వ్ కా భలా). తర్వాత శంఖు మొదలైనవి పూరిస్తారు. ఇప్పుడు హాహాకారాలవుతాయని పిల్లలైన మీకు తెలుసు. పాకిస్తాన్‌లో ఏమేం జరిగాయో చూశారు కదా! అందరి నోటి ద్వారా ఇవే శబ్దాలు వెలువడేవి - "ఓ భగవంతుడా!, ఓ రామా! ఇప్పుడేమవుతుంది అని భయపడేవారు." కాని ఇప్పుడిక జరగబోయే వినాశనము చాలా పెద్దది. దీని తర్వాత జయ జయ ధ్వనులు వినిపిస్తాయి. ఈ అనంతమైన ప్రపంచము ఇప్పుడు వినాశనమవుతుందని తండ్రి పిల్లలకు అర్థం చేయిస్తున్నారు. అనంతమైన తండ్రి అనంతమైన జ్ఞానాన్ని మీకు వినిపిస్తారు. హద్దు విషయాలను చరిత్ర-భూగోళాలను వింటూ వచ్చారు. లక్ష్మీనారాయణులు రాజ్యపాలన ఎలా చేశారో ఎవ్వరికీ తెలియదు. వీరి చరిత్ర-భూగోళాలు ఎవ్వరికీ తెలియదు. ఇన్ని జన్మలు రాజ్యపాలన చేశారని తర్వాత ఫలానా ధర్మముంటుందని మీరు బాగా అర్థం చేసుకున్నారు. దీనిని స్పిరుచువల్ నాలెడ్జ్(ఆధ్యాత్మిక జ్ఞానము) అని అంటారు. ఈ జ్ఞానాన్ని స్పిరుచువల్ ఫాదర్(ఆత్మిక తండ్రి) కూర్చొని పిల్లలకు ఇస్తారు. అక్కడ మనుష్యులు మనుష్యులను చదివిస్తారు. ఇక్కడ ఆత్మలమైన మనలను పరమాత్మ తమ సమానంగా చేస్తున్నారు. టీచర్ తప్పకుండా తన సమానంగా చేస్తారు కదా!

నేను మిమ్ములను నా కంటే ఉన్నతంగా డబల్ కిరీటధారులుగా చేస్తానని తండ్రి అంటున్నారు. స్మృతి ద్వారా ప్రకాశ కిరీటము లభిస్తుంది, 84 జన్మల చక్రాన్ని తెలుసుకోవడం ద్వారా మీరు చక్రవర్తి రాజులుగా అవుతారు, ఇప్పుడు పిల్లలైన మీకు కర్మ-అకర్మ-వికర్మల గతిని కూడా అర్థము చేయించాను.

సత్యయుగములో కర్మ అకర్మగా ఉంటుంది. రావణ రాజ్యములో కర్మ వికర్మగా అవుతుంది. మెట్లు దిగుతూ వస్తారు, కళలు తక్కువ అవుతూ అవుతూ క్రిందికి దిగవలసిందే. ఎంతో ఛీ-ఛీగా అయిపోతారు(పాడైపోతారు). మళ్లీ తండ్రి వచ్చి భక్తులకు ఫలమిస్తారు. ప్రపంచములో అందరూ భక్తులే. సత్యయుగంలో భక్తులెవ్వరూ ఉండరు. భక్తి సంప్రదాయం ఇక్కడే ఉంది. అక్కడ జ్ఞాన ప్రాలబ్ధముంటుంది. మేము తండ్రి ద్వారా బేహద్ ప్రాలబ్ధాన్ని తీసుకుంటున్నామని ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు. ఎవరికైనా మొట్టమొదట ఈ లక్ష్మీనారాయణుల చిత్రము చూపి వివరించండి. నేటికి 5 వేల సంవత్సరాల క్రితము వీరి రాజ్యము ఉండేది. విశ్వములో సుఖము-శాంతి-పవిత్రత అన్నీ ఉండేవి. అప్పుడు ఇంకే ధర్మమూ ఉండేది కాదు. ఈ సమయంలో అనేక ధర్మాలున్నాయి. అప్పటి మొదటి ధర్మము ఇప్పుడు లేనే లేదు. మళ్లీ ఈ ధర్మము తప్పకుండా రావలసిందే. ఇప్పుడు తండ్రి ఎంత ప్రేమగా చదివిస్తున్నారు! యుద్ధము మాటే లేదు. ఇది బెగ్గరీ లైఫ్(పేద జీవితము), పరాయి రాజ్యము, మనదంతా గుప్తము. తండ్రి కూడా గుప్తంగా వచ్చి ఉన్నారు. ఆత్మలకు కూర్చొని అర్థము చేయిస్తున్నారు. ఆత్మయే అన్నీ చేస్తుంది. శరీరము ద్వారా పాత్రను అభినయిస్తుంది. అది ఇప్పుడు దేహాభిమానములోకి వచ్చింది. ఇప్పుడు దేహీ-అభిమానులుగా అవ్వండి అని తండ్రి చెప్తున్నారు. తండ్రి ఇక ఏ ఇతర కష్టమునివ్వరు. తండ్రి గుప్త రూపములో వచ్చారు. కనుక పిల్లలైన మీకు గుప్త దానంగా విశ్వరాజ్య చక్రవర్తి పదవినిస్తారు. మీదంతా గుప్తము. అందుకే ఆచారము ప్రకారం కన్యకు వరకట్నము ఇచ్చేటప్పుడు గుప్తంగానే ఇస్తారు. నిజానికి గుప్త దానము మహాపుణ్యమని మహిమ చేయబడ్తుంది. ఇద్దరు-ముగ్గురికి తెలిసినట్లయితే ఆ శక్తి తక్కువైపోతుంది.

పిల్లలూ! మీరు ప్రదర్శినిలో మొట్టమొదట ఈ లక్ష్మీనారాయణుల చిత్రము పై అందరికీ అర్థం చేయించమని తండ్రి చెప్తున్నారు. విశ్వములో శాంతి కావాలని మీరు కోరుకుంటారు కదా! కాని అది ఎప్పుడు ఉండేదో ఎవరి బుద్ధిలోనూ లేదు. సత్యయుగంలో పవిత్రత, సుఖము, శాంతి అన్నీ ఉండేవని మీకు ఇప్పుడు తెలుసు. ఫలానావారు స్వర్గస్థులయ్యారని గుర్తు చేసుకుంటారే కాని ఏమీ అర్థము చేసుకోరు. ఎవరికేం తోస్తే అది చెప్పేస్తారు. అర్థమే ఉండదు. ఇది డ్రామా. మధురాతి మధురమైన పిల్లలకు, మేము 84 జన్మల చక్రాన్ని తిరిగామనే జ్ఞానము బుద్ధిలో ఉంది. పతిత ప్రపంచము నుండి పావన ప్రపంచములోకి తీసుకెళ్లేందుకు తండ్రి ఇప్పుడు వచ్చారు. తండ్రి స్మృతిలో ఉంటూ ట్రాన్స్ఫర్(బదిలీ) అవుతారు. ముళ్ల నుండి పుష్పాలుగా అవుతారు. మళ్లీ మనము చక్రవర్తి రాజులుగా అవుతాము. అలా తయారు చేసేవారు తండ్రి. ఆ పరమాత్మ సదా పవిత్రమైనవారు. పవిత్రంగా చేసేందుకు వారే వస్తారు. సత్యయుగములో మీరు సుందరంగా అవుతారు. అక్కడ సహజ సౌందర్యముంటుంది. ఈ రోజుల్లో కృత్రిమ శృంగారము చేసుకుంటారు కదా. ఎటువంటి ఫ్యాషన్లు వెలువడ్డాయి! ఎటువంటి వస్త్రాలను ధరిస్తారో చూడండి. ఇంతకుముందు స్త్రీలు ఎవరి దృష్టి తమ పై పడరాదని పర్దాలలో ఉండేవారు. ఇప్పుడైతే చాలా తెరిచేశారు, వికారులుగా అయ్యారు అందుకే ఎక్కడ చూసినా పాపము, వికారము పెరిగిపోయింది. చెడు వినకండి అని తండ్రి అంటున్నారు.

రాజులో శక్తి ఉంటుంది. ఈశ్వరార్థంగా దానము చేసినప్పుడు అందులో శక్తి ఉంటుంది. ఇక్కడ ఎవ్వరిలోనూ శక్తి లేదు. ఎవరికి ఏది తోస్తే వారది చేస్తూ ఉంటారు. చాలా మురికి మనుష్యులున్నారు, మీరు చాలా సౌభాగ్యశాలురు ఎందుకంటే నావికుడు మీ చేతిని పట్టుకున్నాడు.

కల్ప-కల్పము మీరే నిమిత్తంగా అవుతారు. మొదట ముఖ్యమైనది దేహాభిమానమని మీకు తెలుసు. దాని తర్వాతనే అన్ని భూతాలు వస్తాయి. పరిశ్రమ చేయాలి. మిమ్ములను మీరు ఆత్మగా భావించి తండ్రిని స్మృతి చేయండి. ఇదేమీ చేదు మందు కాదు. కేవలం మిమ్ములను మీరు ఆత్మగా భావించి తండ్రిని స్మృతి చేయండి. బాబా స్మృతిలో ఉంటూ ఎంత దూరము కాలినడకన వెళ్లినా పాదాలు అలసిపోవు, తేలికగా అయిపోతారు. చాలా సహయోగము లభిస్తుంది. మీరు మాస్టర్ సర్వశక్తివంతులుగా అవుతారు. మనము విశ్వానికి అధికారులుగా అవుతామని మీకు తెలుసు. తండ్రి దగ్గరకు వచ్చారు. ఇంకే కష్టమూ ఇవ్వరు. కేవలం చెడు వినకండి అని పిల్లలకు చెప్తారు. సర్వీసు యోగ్యులైన పిల్లల నోటి ద్వారా సదా జ్ఞాన రత్నాలే వెలువడ్తాయి. జ్ఞాన విషయాలు తప్ప ఇతర ఏ మాటలూ వెలువడరాదు. మీరు ఇక్కడి మాటలు అక్కడ, అక్కడి మాటలు ఇక్కడ ఎప్పుడూ చెప్పరాదు, వినరాదు. సేవ చేసే పిల్లల నోటి నుండి సదా రత్నాలే వెలువడ్తాయి. జ్ఞాన మాటలు వినిపించడం తప్ప మిగిలినదంతా రాళ్లు విసరడము వంటిదే. రాళ్లు విసరడం లేదంటే తప్పకుండా జ్ఞాన రత్నాలనే ఇస్తారు. రాళ్లైనా విసురుతారు లేదా అవినాశి జ్ఞాన రత్నాలనైనా ఇస్తారు. వీటి విలువను మాటలలో వర్ణించలేరు. తండ్రి వచ్చి మీకు జ్ఞాన రత్నాలను ఇస్తారు. అది భక్తి. అక్కడ రాళ్లనే వేస్తూ ఉంటారు.

తండ్రి చాలా చాలా మధురమైనవారని పిల్లలకు తెలుసు. మీరు తల్లి - తండ్రి అని అర్ధకల్పము నుండి మహిమ చేస్తూ వచ్చారు, కాని అర్థము ఏ మాత్రము గ్రహించకుండా ఉండేవారు. చిలుక మాదిరి కేవలం పాడుతూ ఉండేవారు. పిల్లలైన మీకు ఎంతో సంతోషముండాలి. బాబా మనకు బేహద్ వారసత్వాన్ని, విశ్వ రాజ్యభాగ్యాన్ని ఇస్తున్నారు. 5 వేల సంవత్సరాల క్రితము మనము విశ్వానికి యజమానులుగా ఉండేవారము. ఇప్పుడు లేము, మళ్లీ అవుతాము. శివబాబా బ్రహ్మ ద్వారా వారసత్వమునిస్తారు. బ్రాహ్మణ కులము కావాలి కదా. భగీరథుడని చెప్పడం ద్వారా కూడా అర్థము చేసుకోలేరు. కనుక బ్రహ్మ మరియు అతని బ్రాహ్మణ కులము ఉంది. బ్రహ్మ తనువులో ప్రవేశిస్తారు కనుక అతడిని(బ్రహ్మ) భగీరథుడు అని అంటారు. బ్రహ్మ పిల్లలే బ్రాహ్మణులు. బ్రాహ్మణులది శిఖర (పిలక) స్థానము. విరాట రూపము కూడా ఎలా ఉంటుందంటే పైన బాబా తర్వాత ఎవరైతే ఈశ్వరీయ సంతానంగా అవుతారో ఆ సంగమయుగ బ్రాహ్మణులు ఉంటారు. మేము ఇప్పుడు ఈశ్వరీయ సంతానంగా అయ్యామని తర్వాత దైవీ సంతానంగా అవుతామని మీరు తెలుసుకున్నారు. కనుక డిగ్రీ తగ్గిపోతుంది. ఈ లక్ష్మీనారాయణుల డిగ్రీ కూడా తక్కువే ఎందుకంటే వీరిలో జ్ఞానము లేదు. జ్ఞానము బ్రాహ్మణులైన మీలో ఉంది. కాని లక్ష్మీనారాయణులను అజ్ఞానులని అనరు. వీరు జ్ఞానము ద్వారా ఈ పదవిని పొందుకున్నారు. బ్రాహ్మణులైన మీరు ఎంతో ఉన్నతమైనవారు, తర్వాత దేవతలుగా అయినప్పుడు జ్ఞానము ఏ మాత్రమూ ఉండదు. వారిలో జ్ఞానముంటే అది దైవీ వంశములో పరంపర నుండి కొనసాగుతూ వచ్చేది. మధురాతి మధురమైన అల్లారుముద్దు పిల్లలకు అన్ని రహస్యాలు, అన్ని యుక్తులు అర్థం చేయిస్తున్నారు. రైలులో కూర్చొని కూడా మీరు సర్వీసు చేయవచ్చు. ఒక చిత్రము గురించి పరస్పరము చర్చించుకుంటూ ఉంటే అనేకమంది కలిసి గుమికూడ్తారు. ఈ కులానికి చెందినవారు మంచిరీతిగా ధారణ చేసి ప్రజలుగా అవుతారు. సర్వీసు కొరకు చాలా మంచి మంచి చిత్రాలున్నాయి. భారతవాసులైన మనము మొదట దేవీదేవతలుగా ఉండేవారము. ఇప్పుడేమీ లేదు. చరిత్ర, భూగోళాలు

మళ్ళీ రిపీట్ అవుతాయి. మధ్యలో ఇది సంగమ యుగము. ఇందులో మీరు పురుషోత్తములుగా అవుతారు. మంచిది.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. జ్ఞాన విషయాలు తప్ప ఇంకే ఇతర విషయాలు నోటి ద్వారా వెలువడరాదు. వ్యర్థ విషయాలనెప్పుడూ వినరాదు. నోటి ద్వారా సదా రత్నాలే వెలువడుతూ ఉండాలి. రాళ్ళు వెలువడరాదు.

2. సర్వీసుతో పాటు స్మృతియాత్రలో ఉండి స్వయాన్ని నిరోగిగా చేసుకోవాలి. అవినాశి సర్జన్ స్వయం భగవంతుడు 21 జన్మలకు నిరోగిగా చేసేందుకు మాకు లభించారు... ఈ నషాలో, ఖుషీలో ఉండాలి.

# వరదానము :- " స్మృతి అనే ఇంద్రజాల మంత్రము ద్వారా అన్ని సిద్ధులను ప్రాప్తి చేసుకునే సిద్ధి స్వరూప భవ "

తండ్రి స్మృతియే ఇంద్రజాల(గారడి) మంత్రము. ఈ ఇంద్రజాల మంత్రము ద్వారా ఏ సిద్ధి కావాలంటే ఆ సిద్ధిని ప్రాప్తి చేసుకోవచ్చు. ఎలాగైతే స్థూలములో కూడా ఏదైనా కార్య సిద్ధి కొరకు మంత్రాన్ని జపిస్తారో, అలా ఇక్కడ కూడా ఏదైనా కార్యము సిద్ధి అవ్వాలంటే ఈ స్మృతి అనే మహామంత్రమే విధి స్వరూపము. ఈ ఇంద్రజాల మంత్రము సెకండులో పరివర్తన చేసేస్తుంది. దీనిని సదా స్మృతిలో ఉంచుకుంటే సదా సిద్ధి స్వరూపులుగా అవుతారు. ఎందుకంటే స్మృతిలో ఉండడం పెద్ద విషయమేమీ కాదు, సదా స్మృతిలో ఉండడమే పెద్ద విషయము. దీని ద్వారానే సర్వ సిద్ధులు ప్రాప్తిస్తాయి.

# స్లోగన్ :- " సెకండులో విస్తారాన్ని సార రూపంలో ఇముడ్చుకోవడం అనగా అంతిమ సర్టిఫికెట్ తీసుకోవడం. "